క్లుప్తంగా

ఆర్ట్స్ కళాశాలలో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు నివాళి



కేయూ క్యాంపస్ : హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో వాణిజ్య శాస్త్ర విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ సురేశ్ మృతికి సంతాప సూచకంగా సోమవారం కళాశాలలో ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.జ్యోతి, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ సురేశ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సురేశ్ క్రమశిక్షణ కలిగిన అధ్యాపకుడని కొనియాడారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. రెండు నిమిషాలు అధ్యాపకులంతా మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ జర్నలిస్టుకు..



సుభాష్ (ఫైల్)

హసన్‌పర్తి : సీనియర్ జర్నలిస్టు, టీయూడబ్ల్యూజే (143) జిల్లా ప్రధాన కార్యదర్శి నాయకపు సుభాష్ (54) సోమవారం గుండెపోటుతో మృతి చెందాడు. సోమవారం అనారోగ్యానికి గురి కావడంతో నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరిస్థితి విషమించడంతో మరో ఆస్పత్రిలో చేర్పించారు. అప్పటికే ఆయన మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఎనిమిదేళ్లుగా సుభాష్ టీయూడబ్ల్యూజే (143) సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. జర్నలిస్టు సమస్యలపై ఆయన నిరంతర పోరాటాలు చేశారు. సుభాష్ మృతి పట్ల జర్నలిస్టులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. సుభాష్ మృతదేహాన్ని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, స్టేషన్‌ఘన్‌పూర్, పరకాల ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు అరూరి రమేశ్, దాస్యం వినయ్‌భాస్కర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, కుడా మాజీ చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్, టెస్కాబ్ రాష్ట్ర చైర్మన్ మార్నేని రవీందర్ రావు, ఏసీపీ జితేందర్‌రెడ్డి, టీయూడబ్ల్యూజే(ఐజేయూ), టీయూడబ్ల్యూజే (143), టీయూడబ్ల్యూజే(ఎఫ్) సంఘాల ప్రతినిధులతో పాటు వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు సందర్శించి నివాళులర్పించారు. సోమవారం రాత్రి భీమారంలోని శ్మశాన వాటికలో సుభాష్ అంత్యక్రియలు నిర్వహించారు.

ఎల్లాపురం లైన్‌మెన్‌గా రవి

హసన్‌పర్తి : ఎల్లాపురం గ్రామ విద్యుత్ లైన్‌మెన్‌గా మేకల రవి నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన సురేశ్ బదిలీ కాగా, గునిపర్తిలో లైన్‌మెన్‌గా పనిచేస్తున్న రవిని ఇక్కడికి బదిలీ చేశారు. ఈ సందర్భంగా రవికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

చేయూతనివ్వాలి

హసన్‌పర్తి: అనాథ వృద్ధులకు చేయూతనివ్వాలని ఉత్తమ సేవా అవార్డు గ్రహీత డాక్టర్ నరేశ్ అన్నారు. భీమారంలోని లార్డ్ వృద్ధాశ్రమంలో సోమవారం అన్నదానం నిర్వహించారు. 66వ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నరేశ్ మాట్లాడుతూ బర్త్‌డే, మ్యారేజ్‌డే, జయంతిలను అనాథ వృద్ధుల మధ్య జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వేల్పుల సంపత్, వేల్పుల సాయికుమార్, నల్ల కిరణ్, శివసాయి, వరుణ్‌సందేశ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఎగ్ కార్ట్స్ పంపిణీ



కాశిబుగ్గ : నగరంలోని చిరువ్యాపారులు, నిరుద్యోగ యువతకు జాతీయ కోడిగుడ్ల సమన్వయ సంఘం (ఎన్‌ఈసీసీ) ఆధ్వర్యంలో సోమవారం ఓ సిటీలోని ఎర్రబెల్లి ప్రదీప్‌రావు నివాసంలో ఎగ్ కార్ట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎన్‌ఈసీసీ జోనల్ చైర్మన్ ప్రదీప్‌రావు మాట్లాడుతూ నిరుద్యోగ యువత, చిరు వ్యాపారులకు ఉపాధి కల్పించేందుకు ఎగ్ కార్ట్స్ పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ గుడ్డు తింటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌ఈసీసీ ప్రతినిధులు, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఏజెంట్ల నిరసన

వరంగల్: ఇన్సూరెన్స్ రెగ్యులేటరి అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఐఆర్‌డీఏఐ) ప్రీమియం ధరలు పెంచడం, ఏజెంట్ల కమీషన్ తగ్గించడం దారుణమని దీంతో ఏజెంట్లు పెద్ద మొత్తంలో నష్టపోతున్నారని ఎల్ఐసీ ఏజెంట్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పబ్బా రాజాశ్రీనివాస్‌రావు అన్నారు. ములుగురోడ్ సమీపంలోని ఎల్ఐసీ కార్యాలయం ఎదుట భోజన విరామ సమయంలో భారతీయ బీమా సంస్థ పెంచిన ప్రీమియం ధరలకు, తగ్గించిన కమీషన్‌లకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి అశోక్, నాయకులు రాజిరెడ్డి, రవీందర్ రావు, యాకయ్య, కుమారస్వామి, శ్రీను, తిరుపతి, సురేందర్, కోటేశ్వరరావు, రమేష్, భిక్షపతి, రవిబాబు పాల్గొన్నారు.

అంతర్గత రోడ్లు..అధ్వానం

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, ప్రజలు
- పట్టించుకోని అధికారులు



గుంతలుగా మారిన శివాలయం వెళ్లే అంతర్గత రహదారి

ఆత్మకూరు : మండల కేంద్రంలోని అంతర్గత రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాకలి ఐలమ్మ విగ్రహం ఎదురుగా శివాలయం వెళ్లే రోడ్డు గుంతలుగా మారి పగుళ్లు ఏర్పడింది. కనీస మరమ్మతులు లేక ప్రయాణికులు, బాటసారులు అవస్థలు పడుతున్నారు. ఎన్నో ఏళ్లుగా రోడ్డు పరిస్థితి ఇలాగే ఉన్నా అధికారులు, ప్రజాప్రతినిధులు కనీసం పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డుపై రాత్రి వేళ వాహనదారులు వెళ్లాలంటే ప్రమాదాల బారిన పడతామని ఆందోళన చెందుతున్నారు. అలాగే మండల కేంద్రంలో గొల్లవాడ రోడ్డు, చెరువు వైపునకు వెళ్లే రోడ్లు కూడా అధ్వానంగా తయారయ్యాయి. ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన అంతర్గత రోడ్లు గుంతలుగా మారినా ఇప్పటివరకు కనీసం మరమ్మతులు కూడా చేపట్టలేదు. ఎస్సీ కాలనీలో అంతర్గత రోడ్ల పరిస్థితి ఇదే విధంగా ఉందని ఎవరు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. వర్షాలు పడితే అంతర్గత రోడ్లు బురదమయంగా చిత్తడిగా తయారవుతున్నాయి. నడిచి వెళ్లేందుకు సైతం వీలులేని దుస్థితి ఏర్పడింది. గుంతలుగా, పగుళ్లు ఏర్పడిన అంతర్గత రోడ్లను బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అంతర్గత రోడ్లను పరిశీలించి మరమ్మతులు చేయాలని ప్రయాణికులు, వాహనదారులు, గ్రామస్తులు కోరుతున్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



వేలేరు: పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య



ఆత్మకూరు: నివాళులర్పిస్తున్న రాజమౌళి

వేలేరు : మండల కేంద్రానికి చెందిన గుండు ఐలయ్య అనారోగ్యంతో మృతిచెందగా విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, తాటికొండ రాజయ్యలు సోమవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఐలయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని అండగా ఉంటామని భరోసా కల్పించారు. అలాగే కన్నారం గ్రామంలోని ఉప్పుల యశోద దశదిన కార్యక్రమానికి హాజరై కుటుంబ సభ్యులను పరామర్శించారు.వారి వెంట మాజీ జెడ్పీటీసీ చాడ సరిత, బీఆర్‌ఎస్ గ్రామ కన్వీనర్ భూపతిరాజు, జానీ, వీరయ్య, ప్రవీణ్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

నివాళి

ఆత్మకూరు : హైదరాబాద్‌లోని మౌలాలిలో ప్రొఫెసర్ సాయిబాబా పార్థివ దేహానికి మండలంలోని నీరుకుళ్ళకు చెందిన రైతు కూలీ సమాఖ్య ఉమ్మడి జిల్లా కన్వీనర్, రాష్ట్ర కమిటీ సభ్యుడు పిట్టల రాజమౌళి, రాజ్యాధికార జిల్లా సమాఖ్య కన్వీనర్ దారకొండ శంకర్ నివాళులర్పించారు. ఈసందర్భంగా రాజమౌళి మాట్లాడుతూ సాయిబాబా సేవలను కొనియాడారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



కాటం తిరుపతి, అధ్యక్షుడు

కమలాపూర్ : మండల కేంద్రంలోని కొత్తవాడలో దుర్గామాత నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కాటం తిరుపతి, ఉపాధ్యక్షుడిగా వడ్డె మహేష్, ప్రధాన కార్యదర్శిగా జక్కు రాజుగౌడ్, సహాయ కార్యదర్శిగా గందసిరి నరేష్, కోశాధికారిగా వెలిశెట్టి శ్రీ ని వాస్ ఎన్నికయ్యారు. కమిటీ డైరెక్టర్లుగా పసుల శివ, వెల్డి లక్ష్మీనారాయణ, కాటం ఆకాశ్, నాసని సాంబయ్య ,అల్లం రాజు, బత్తుల నాగరాజు నియమితులయ్యారు.

జీపీ కార్యదర్శికి వినతి



వినతిపత్రం అందజేస్తున్న యువకులు

నడికూడ : గ్రామంలో కోతుల బెడద అధికంగా ఉందని, శాశ్వత పరిష్కారం చూపించాలని కోరుతూ మండలంలోని ముస్త్యాలపల్లి గ్రామయువత సోమవారం పంచాయతీ కార్యదర్శి కరుణాదేవికి వినతి పత్రం అందజేశారు. కోతులతో అనేక ఇబ్బందులు పడుతున్నామని వారు వివరించారు. కాగా గ్రామ సభ ఏర్పాటు చేసి తగిన చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి

- తెలంగాణ అంబేడ్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రకాశ్

ఎల్కతుర్తి : వరంగల్ జిల్లా దేశాయిపేటలో మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని తెలంగాణ అంబేడ్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాశ్ డిమాండ్ చేశారు. సోమవారం భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల కోసం మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే అనునిత్యం శ్రమించారన్నారు. అణగారిన వర్గాల పిల్లల చదువుకోసం అనేక పాఠశాలలు ఏర్పాటు చేసి వారికి విద్యాబోధన అందించిన మహనీయుడని కొనియాడారు. జ్యోతిబా పూలే సామాజిక సేవా రంగాల్లో మనిచేసిన మహోన్నతమైన వ్యక్తి అని అలాంటి మహనీయుడి విగ్రహం ధ్వంసం చేయడం బాధాకరమన్నారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు మాడుగుల సంపత్, ఎర్ర కార్తిక్, వేముల జగదీశ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'కొత్త పింఛన్ల మంజూరులో నిర్లక్ష్యం'



సమావేశంలో మాట్లాడుతున్న పవన్ కళ్యాణ్

శాయంపేట : కొత్త పింఛన్ల దరఖాస్తుదారులకు ఇప్పటి వరకు పింఛన్ మంజూరు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగుల పవన్ కళ్యాణ్ విమర్శించారు. మండల కేంద్రంలో సోమవారం జరిగిన ఏబీఎస్ఎఫ్ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వితంతువులు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకొని ఏళ్లు గడుస్తున్నా పింఛన్ రాకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యమని అన్నారు. గత ప్రభుత్వంలోనూ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలోను వితంతువులకు అన్యాయం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టాక రూ. 4వేల పెన్షన్ ఇస్తామని ప్రకటించి అధికారం చేపట్టి పది నెలలు గడిచిన కాలయాపన చేస్తోందన్నారు. కొత్త పింఛన్ దరఖాస్తుదారులకు వెంటనే పింఛన్ మంజూరు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం రూ. 4వేల పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న స్థానిక ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు. నాయకులు సుమన్, రాజు, రమేశ్, వినయ్ పాల్గొన్నారు.

సొంతింటి కల.. ప్రభుత్వ ధ్యేయం



ఇందిరమ్మ కమిటీ సభ్యులను అభినందిస్తున్న నాయకులు

దామెర : సొంతింటి కలను నిజం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఆపార్టీ జిల్లా నాయకుడు బిల్లా రమణారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గ్రామపార్టీ అధ్యక్షుడు దుర్శెట్టి భిక్షపతి ఆధ్వర్యంలో ముఖ్యకార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రమణారెడ్డి హాజరై మాట్లాడారు. ఇందిరమ్మ కమిటీ ఆధ్వర్యంలో ఇళ్లు లేని నిరుపేదలను గుర్తించి ఇళ్లను మంజూరు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. అనంతరం ఇందిరమ్మ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పోతుల విజయ, మేరుగ విజయ, కదం నగేష్, దామెర కట్టయ్య, అమ్ముల రవికుమార్‌ను సభ్యులుగా ఎన్నుకున్నారు. ఎన్నికైన సభ్యులను సీనియర్ నాయకులు గంగిడి శ్రీధర్ రెడ్డి, సదిరం పోశాలు, పోతుల కొమ్మాలు, గడ్డం రమేష్, మొద్దు ప్రవీణ్, పోతుల రాజకొమురు, సోనబోయిన రవి, లింగయ్య, దామెర రతన్, రజినీకర్, వంశీ అభినందనలు తెలిపారు.

వైభవంగా అమ్మవారి ఊరేగింపు



కాజీపేట : దుర్గామాత విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు



కాశిబుగ్గ : ఊరేగింపులో నృత్యాలు చేస్తున్న మహిళలు

కాజీపేట : శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం రాత్రి కాజీపేటలో దుర్గామాత అమ్మవారి విగ్రహాన్ని పురవీధుల్లో భక్తులు ఊరేగించారు. శ్రీభ్రమరాంభిక మల్లికార్జునస్వామి దేవాలయం ఆవరణలో శివశక్తి యూత్ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాతకు ఆలయ ప్రధాన అర్చకులు ఐనవోలు ప్రవీణ్‌కుమార్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. యువకుల నృత్యాలు, డప్పు వాయిద్యాలు, పిల్లల కేరింతల నడుమ అమ్మవారి ప్రతిమలను ఊరేగించి బంధం చెరువులో నిమజ్జనం చేశారు. యూత్ అసోసియేషన్ సభ్యులు మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అసోసియేషన్ సభ్యులు రవీందర్,శ్రీధర్,బి.రంజిత్‌కుమార్, లక్ష్మణ్ కొల్హారియా, దీపక్ కొల్హారియా, బిల్ల సతీష్, గణేష్‌సింగ్ పాల్గొన్నారు.

కాశిబుగ్గ : వరంగల్–నర్సంపేట ప్రధాన రహదారి దయానందకాలనీ సమీపంలోని శ్రీ కనకదుర్గా మాత దేవాలయంలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు ఆదివారం రాత్రి ముగిశాయి. తొమ్మిది రోజులు పూజలందుకున్న ఆమ్మవారిని డప్పుచప్పుళ్లు, భక్తుల కోలాటాలు, నృత్యాలతో ప్రత్యేక వాహనంపై ఊరేగించి సోమవారం తెల్లవారుజామున గొర్రెకుంట కట్టమల్లన్న చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మీసాల ప్రకాశ్, సింగిరికొండ వెంకటేశ్వర్లు, సర్వేరియా సురేష్‌కుమార్, కొప్పుల సరోజన, కొంక వెంకటేశ్వర్లు, పప్పు వేణు, ప్రభాకర్, శారద తదితరులు పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డిని కలిసిన రైల్వే జేఏసీ నాయకులు

మంత్రి దృష్టికి కాజీపేట రైల్వే డివిజన్ ప్రస్తావన

కాజీపేట రూరల్ : కాజీపేట తెలంగాణ రైల్వే జేఏసీ నాయకుల బృందం హనుమకొండ బీజేపీ జిల్లా కార్యాలయంలో సోమవారం రాత్రి కేంద్ర గనుల శాఖమంత్రి కిషన్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా రైల్వే జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్, చైర్మన్ కోండ్ర నర్సింగరావు మాట్లాడుతూ.. కాజీపేట రైల్వే వ్యాగన్ రిపేర్ వర్క్‌షాప్‌ను వ్యాగన్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌గా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయించారు. అలాగే ఇప్పుడు కొత్తగా కాజీపేట వ్యాగన్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌తో పాటు నాలుగు దశాబ్దాల కలగా ఉన్న తెలంగాణ ప్రాంత ప్రజల ఆకాంక్ష అయిన కాజీపేట రైల్వేకోచ్ ఫ్యాక్టరీగా అప్‌గ్రేడ్ చేస్తూ కేంద్రప్రభుత్వ తీసుకున్న నిర్ణయానికి గాను ప్రధాని, రైల్వే పరిశ్రమలకు సహకరించిన కిషన్‌రెడ్డికి, జిల్లా అధ్యక్షరాలు రావు పద్మలను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపినట్లు చెప్పారు. మ్యాన్‌ఫ్యాక్చరింగ్ యూనిట్‌ను అలాగే కొనసాగిస్తూ కోచ్ ఫ్యాక్టరీగా అప్‌గ్రేడ్ చేశాము కానీ రైల్వే మంత్రిత్వశాఖ నుంచి లెటర్ రావాల్సి ఉందని తెలిపినట్లు మంత్రి కిషన్‌రెడ్డి తమతో తెలిపినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా కాజీపేటను రైల్వే డివిజన్‌గా చేయాల్సిన అవసరం ఉందని రైల్వే జేఏసీ బృందం కిషన్‌రెడ్డికి విన్నవించగా ఈ ప్రాంత ప్రజల కోసం ఒకదాని తర్వాత మరొకటి చేయడానికి కేంద్రప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈ ప్రాంతంలో ఫోర్త్ లైన్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని రాబోయే రోజుల్లో శుభవార్తలు వింటారని రైల్వే జేఏసీ బృందంతో మాట్లాడినట్లు వారు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో వి.తిరుపతి, ఎ.శ్రీనివాస్, జి.భాస్కర్, ఎం.మహేష్, ఎప్పేజర్, పి.రమేష్, ఎం.కె.మూర్తి, డి.రవీందర్, కరుణాకరచారి ఉన్నారు.

నరకాసుర వధకు ఏర్పాట్లు చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ మరుపల్లి రవి

ఖిలా వరంగల్ : ఈనెల 30న ఉర్సుగుట్ట రంగలీల మైదానంలో నిర్వహించే నరకాసుర వధ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేయాలని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, కార్పొరేటర్ మరుపల్లి రవి కోరారు. సోమవారం వరంగల్ కలెక్టర్ సత్యశారదను ఆయన కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆ యన మాట్లాడుతూ నరకాసుర వధకు 50 వేల మంది హాజరవుతారని, ఉర్సుగుట్ట రంగలీల మైదానంలో పెద్ద ఎత్తున విద్యుత్, ఆధునిక సౌండ్ సిస్టంతో పాటు ఇతర సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్‌ను కోరగా సంబంధిత అధికారులకు తెలియజేసి, ఏర్పాట్లు చేయిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ప్రధాన కార్యదర్శి శతపతి శ్యామలరావు, అవునూరి రామ్మూర్తి, వనం కుమార్, దూడ కొమురెల్లి, అన్న కుమారస్వామి, తొటం నరసింహా గౌడ్, రామ్ ఉన్నారు.

కాంగ్రెస్ నాయకుడిపై దాడి హేయం



దామెర: మాట్లాడుతున్న ప్రకాశ్ రెడ్డి



ఆత్మకూరు: సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్



పరకాల: సమావేశంలో మాట్లాడుతున్న మొలుగూరి భిక్షపతి

దామెర : కాంగ్రెస్ పార్టీ నాయకుడిపై దాడిచేయడం హేయమైన చర్య అని ఆపార్టీ మండల అధ్యక్షుడు మన్నెం ప్రకాశ్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గీసుగొండ మండలంలోని ధర్మారంలో దసరా పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ వివాదానికి దారితీసిన సంగతి తెలిసిందే. కాగా కాంగ్రెస్ పార్టీకి చెందిన పిట్టల అనిల్‌పై దాడి చేయం బాధాకరమని అన్నారు. దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ప్రకటించారు. సమావేశంలో నాయకులు గుడిపాటి శ్రీధర్ రెడ్డి, కూనాటి రామకృష్ణా రెడ్డి, జన్ను రాంచందర్, జక్కుల రవి, దామెర శంకర్, కిన్నెర కోటి, దుబాసి రాజేందర్ తదితరులు ఉన్నారు.

'మంత్రి కొండా సురేఖ తీరు సరికాదు'

ఆత్మకూరు : గీసుకొండ మండలంలో చోటుచేసుకున్న ఫ్లెక్సీ వివాదంపై మంత్రి కొండా సురేఖ అనుసరించిన తీరు సరికాదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కమలాపురం రమేశ్ అన్నారు. మండల కేంద్రంలో ఆయన సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గీసుకొండ మండలంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ఫొటో లేకపోవడంపై ప్రశ్నించిన ఓ కార్యకర్తపై దాడి చేయడం సరికాదన్నారు. దాడి చేసిన వారికి మంత్రి కొండా సురేఖ మద్దతు ఇవ్వడం వల్ల కార్యకర్తల మనోధైర్యం దెబ్బతిన్నదని చెప్పారు. ఇప్పటికైనా జిల్లాలో కాంగ్రెస్ పార్టీలో సమన్వయం ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత మంత్రి సురేఖపై ఉందన్నారు. సమావేశంలో కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పరికిరాల వాసు, నాయకులు బీరం సుధాకర్‌రెడ్డి, ఏరుకొండ రవీందర్‌గౌడ్, పర్వతగిరి రాజు, రేవూరి జయపాల్‌రెడ్డి, కిరీటి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సురేఖది అనవసర రాద్ధాంతం: పరకాల మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి

పరకాల : గీసుగొండలో జరిగిన ఫ్లెక్సీ వివాదంలో మంత్రి హోదాలో ఉండి కార్యకర్తలకు నచ్చజెప్పాల్సిన కొండా సురేఖ అనవసర రాద్ధాంతం సృష్టించడం సరైంది కాదని పరకాల మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి అన్నారు. పరకాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఆవరణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మచ్చలేని నాయకుడని కొనియాడారు.అలాంటి నాయకుడుపై నిందారోపణలు చేయడం సరైంది కాదన్నారు. వాస్తవానికి స్థానిక ఎమ్మెల్యే ఫొటోను దసరా ఉత్సవాల ఫ్లెక్సీలలో పెట్టకపోవడంతోనే గొడవకు దారి తీసిందన్నారు. ఈ విషయంపై ప్రశ్నించినందుకు కాంగ్రెస్ సీనియర్ కార్యకర్త అనిల్‌పై దాడి చేయడంపై మందలించాల్సిన మంత్రి కొండా సురేఖ దాడిచేసిన వారికే వత్తాసు పలుకడం అన్యాయమన్నారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్ మాట్లాడుతూ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఏనాడు వర్గాలను ప్రోత్సహించలేదన్నారు. ఈ కార్యక్రమంలో పరకాల మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణ, కౌన్సిలర్ పంచగిరి జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

రీయింబర్స్‌మెంట్ విడుదల చేయండి

వరంగల్: రాష్ట్రంలోని విద్యార్థులకు పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్‌బీ రాష్ట్ర కన్వీనర్ హకీమ్ నవీద్ డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ల విడుదలపై గత ప్రభుత్వం మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం సైతం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. గత మూడేళ్లుగా వేల కోట్ల రూపాయలు ఫీజు రీయింబర్స్‌మెంట్ల బకాయిలు పెండింగ్‌లో ఉండడంతో డిగ్రీ, పీజీ విద్యార్థులు చదువులు పూర్తయినా సర్టిఫికెట్లు తీసుకోవడంలో అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలు లెక్చరర్లకు జీతాలు ఇవ్వలేక, అద్దె భవనాలకు కిరాయిలు కట్టలేక తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయని అన్నారు. ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా ఆయా యూనివర్సిటీల పరిధిలో ఉన్న డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలు నిరవధిక బంద్‌కు పిలుపు ఇచ్చినందున విద్యార్థులు తీవ్ర ఆందోళనలకు గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు.